క్లుప్తంగా

జాతీయస్థాయి ఇన్‌స్పైర్‌కు నిఖిల్‌వర్మ ఎంపిక



కాశోజీ సెంటర్ : జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ మనాక్ 2023–2024 ఎగ్జిబిషన్‌కు నెక్కొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి భట్టు నిఖిల్‌వర్మ ఎంపికయ్యాడు. ఈ నెల 14, 15వ తేదీల్లో వర్చువల్ పద్ధతిన జరిగిన రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో 259 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఇందులో నిఖిల్‌వర్మ రూపొందించిన వాటర్ క్లీనర్ బోట్ ఎగ్జిబిట్ జాతీయస్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్.. నిఖిల్‌వర్మ, గైడ్ టీచర్ విశ్వప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు రంగారావు, ఉపాధ్యాయులను అభినందించారు. అలాగే, న్యూఢిల్లీలో జరిగే జాతీయస్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో నిఖిల్‌వర్మ పాల్గొంటాడని డీఈఓ, డీఎస్‌ఓ శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.

పిచ్చి మొక్కల తొలగింపు

ఖిలా వరంగల్: వరంగల్ 40వ డివిజన్ కరీమాబాద్‌లో రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను శనివారం తొలగించారు. ప్రజల అభ్యర్థన మేరకు కార్పొరేటర్ మరుపల్లి రవి స్పందించారు. బల్దియా అధికారుల ఆధ్వర్యంలో పారిశుద్ధ్య సిబ్బంది గ్యాంగ్‌వర్క్ నిర్వహించి పరిసరాలను శుభ్రం చేశారు. శానిటరీ జవాన్ ప్రశాంత్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్‌ను సరిచేయాలి

ఖిలా వరంగల్: వరంగల్ 39వ డివిజన్‌లోని సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ సిద్ధం రాజు కోరారు. వరంగల్ – ఉర్సు కరీమాబాద్‌కు వెళ్లే ప్రధాన రోడ్డుపైన ఇటీవల నిర్మించిన శాకరాశికుంట కల్వర్టు పక్కన తక్కువ ఎత్తులో ఉన్న తాగునీటి పైపులైను తొలగించాలని సూచించారు. వరద ముంపు ప్రాంతమైన శాకరాశికుంటలో అధికారులతో కలిసి కార్పొటర్ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైపులైన్ తక్కువ ఎత్తులో ఉండటంతో చెత్తాచెదారం పోగవడంతో మురుగునీరు ముందుకు వెళ్లడం లేదని అన్నారు. ముంపు ప్రాంతంలో ఎదురవుతున్న ప్రధాన సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం మార్గం చూపుతామని బల్దియా సూపర్‌వైజర్ సాంబయ్య తెలిపారు.

ప్లంబర్ ఆత్మహత్య

హసన్‌పర్తి: అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మానసిక వేదనకు గురైన ప్లంబర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. వంగపహాడ్‌కు చెందిన దోమ రమేష్(50) ప్లంబింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంతకాలం క్రితం అనారోగ్యానికి గురికాగా, వైద్యం తీసుకున్నప్పటికీ వ్యాధి నయం లేదు. దాంతో జీవితంపై విరక్తి చెందిన ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు యశ్వంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ సురేష్ శనివారం తెలిపారు.

యువతి అదృశ్యం

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి క్రిస్టియన్ కాలనీకి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. వరంగల్ లేబర్ కాలనీ (క్రిస్టియన్ కాలనీ)కి చెందిన రొట్టల రాజు కుమార్తె నందిని (18) శుక్రవారం మధ్యాహ్నం స్నేహితురాలి ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దాంతో తండ్రి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మతిస్థిమితం లేని వృద్ధురాలు..

వరంగల్ ఫోర్ట్‌రోడ్డుకు చెందిన మానసిక స్థితి సరిగాలేని ఓ వృద్ధురాలు అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. రుద్రమాంబ నగర్‌కు చెందిన బొల్ల శంకర్ తల్లి ప్రమీల (60) మానసిక స్థితి సరిగాలేదు. శుక్రవారం ఇంటిలో నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. బొల్ల శంకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

కాజీపేట: కాజీపేట రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సంఘం అధ్యక్షుడు కె.సంఘమయ్య శనివారం ప్రారంభించారు. హనుమకొండ శరత్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పెన్షనర్లకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

సిల్వర్‌జూబ్లీ వేడుకలు

హసన్‌పర్తి: కిట్స్ కళాశాల పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు గత స్మృతులను గుర్తుచేసుకున్నారు. అనంతరం సీనియర్ ప్రొఫెసర్లను సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కళాశాల చైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంత రావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

వరంగల్: అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను హైదరాబాదులోని కార్యాలయంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు శనివారం కలిశారు. ఈ సందర్భంగా వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని కోరారు. కటకం పెంటయ్య, సాగర్ల శ్రీనివాస్, లింగారెడ్డి పాల్గొన్నారు.

4వ డివిజన్‌లో పడకేసిన అభివృద్ధి

- అధ్వానంగా అంతర్గత రోడ్లు
- రోడ్లపైనే పారుతున్న మురుగునీరు
- యాదవనగర్ శ్మశాన వాటికలో వసతుల లేమి
- వెంటాడుతున్న వీధి కుక్కల బెడద



యాదవనగర్‌లో రోడ్డుపైనే వేసిన చెత్త



పగుళ్లు బారి అధ్వానంగా ఉన్న సీసీ రోడ్డు



పెద్దమ్మగడ్డలో రోడ్డుపై నిలిచిన మురుగునీరు

హన్మకొండ చౌరస్తా: వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధి (హనుమకొండ)లోని 4వ డివిజన్‌లో అభివృద్ధి కుంటుపడింది. ప్రజాప్రతినిధుల పట్టింపు లేనితనం, అధికారుల నిర్లక్ష్యంతో డివిజన్‌లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ఎన్నికల హామీలను స్థానిక ప్రజాప్రతినిధులు అమలు చేయడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేద, మధ్య తరగతి వారే అధికం

డివిజన్‌లో పెద్దమ్మగడ్డ, అక్షరకాలనీ, లోటస్ కాలనీ, సాయికృష్ణ కాలనీ, యాదవనగర్, గౌతమినగర్, దుర్గాకాలనీ, రెడ్డికాలనీ ప్రాంతాలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో సుమారు 30వేల వరకు జనాభా నివసిస్తుండగా 11వేల మంది ఓటర్లు ఉన్నారు. ఈ డివిజన్‌లో అధిక శాతం నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పేద ప్రజలు నివసిస్తున్నారు. దినసరి కూలీలు, ఆటో డ్రైవర్లు, బట్టల దుకాణాలు, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు చేస్తూ చాలీచాలని వేతనాలతో కుటుంబాలను లాక్కొస్తున్న వారే చాలామంది ఉన్నారు. పేదలు నివసించే కాలనీల పట్ల ప్రజాప్రతినిధులు, అధికారులకు చిన్నచూపు చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పేరుకుపోయిన సమస్యలు

కేయూ నుంచి పెద్దమ్మగడ్డకు వెళ్లే ప్రధాన రహదారి వెంట యాదవనగర్‌లో సైడ్ డ్రెయినేజీ లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపై పారుతోంది. దాంతో వాహనదారులు ఇబ్బందులు పడడమే కాకుండా వాహనాలు వెళ్లే క్రమంలో పాదచారులపై మురుగునీరు పడుతోంది. దళితులు ఎక్కువగా నివసించే పెద్దమ్మగడ్డలో ముగురునీటి కాల్వ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దుర్వాసనతోపాటు దోమల బెడదతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యాదవనగర్, రెడ్డికాలనీ ప్రాంతాల్లో అంతర్గత సీసీ రోడ్లు అధ్వానంగా మారాయి. కంకరతేలి, గుంతలు పడిన రోడ్లపై వర్షాకాలంలో, రాత్రివేళల్లో ప్రయాణించాలంటే వాహనదారులు భయపడుతున్నారు. డివిజన్‌లో చెత్త కుండీలు లేకపోవడంతో రోడ్లపైనే చెత్తాచెదారాన్ని వేస్తుండడంతో పరిసరాలన్నీ డంపింగ్ యార్డ్‌ను తలపిస్తున్నాయి. ఈ సమస్యలకు తోడు వీధి కుక్కల భయం ప్రజలను వెంటాడుతోంది. గుంపులుగా మాటు వేస్తూ ప్రజలపై దాడులకు తెగబడుతున్నాయి. దాంతో బయటకు రావడానికి స్థానికులు వణికిపోతున్నారు.

టెండర్ రీకాల్..

డివిజన్‌లోని యాదవనగర్ శ్మశానవాటికలో కనీస సదుపాయాలు కరువయ్యాయి. శ్మశాన వాటిక అభివృద్ధికి మూడేళ్ల క్రితం కోటి రూపాయలతో ప్రతిపాదనలు సిద్ధం చేయగా అప్పటి ప్రభుత్వ హయాంలో రూ.40లక్షలు మంజూరయ్యాయి. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ పలు కారణాలతో ముందుకు రాకపోవడంతో తిరిగి టెండర్లను రీకాల్ చేశారు. దాంతో శ్మశాన వాటిక పనులు నిలిచిపోయాయి.

పనులు జరుగుతున్నాయి



రూ.9.60 కోట్లతో డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో సీసీ రోడ్లు, సైడ్ డ్రెయినేజీ, ఇతర అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపించాను. అందుకు సంబంధించిన నిధులు సైతం మంజూరు కాగా, కొన్ని చోట్ల పనులను ప్రారంభించాం. ఎన్నికల కోడ్ వల్ల పనులు నిలిచిపోయాయి. త్వరలోనే అసంపూర్తి పనులను పూర్తిచేస్తాం.

– బొంగు అశోక్ యాదవ్, కార్పొరేటర్, 4వ డివిజన్

వీధి కుక్కల బెడదను అరికట్టాలి



వీధి కుక్కలతో పిల్లలు, వృద్ధులు బయటికి వెళ్లేందుకు భయపడుతున్నారు. రెడ్డి కాలనీ, యాదవనగర్, పెద్దమ్మగడ్డలో ఏ వాడలో చూసినా వీధి కుక్కలే దర్శనమిస్తున్నాయి. ఒంటరిగా కనిపిస్తే దాడులకు తెగబడుతున్నాయి. కుక్కల దాడిలో గాయపడిన ఘటనలు వారానికి రెండైనా చోటు చేసుకుంటున్నాయి. అయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి వీధి కుక్కల బెడదను అరికట్టాలి.

– తోట రమేష్, రెడ్డికాలనీ

విశ్వకర్మ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయండి



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం బాధ్యులు

హన్మకొండ చౌరస్తా: పీఎం విశ్వకర్మ కౌశల్ యోజన పథకం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణ సంఘం బాధ్యులు కోరారు. ఈమేరకు జిల్లా పరిశ్రమల శాఖాధికారి హరిప్రసాద్‌ను హనుమకొండలోని కార్యాలయంలో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లేటి కృష్ణమాచార్యులు మాట్లాడుతూ అర్బన్ ప్రాంతంలో ఆన్‌లైన్ ప్రారంభం కాకపోవడం వలన చేతివృత్తిదారులు, ఆర్టిజన్లు ఇతర ప్రాంతాల నుంచి నమోదు చేసుకుంటున్నారని అన్నారు. నిజామాబాద్, సిద్దిపేట, మేడ్చల్, హైదరాబాద్ లాంటి జిల్లాల్లో ఇప్పటికే విశ్వకర్మ కౌశల్ యోజన పథకం ద్వారా శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ఈక్రమంలో స్థానికంగా నెలకొల్పాలని కోరారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు పెండోట సురేష్, అలుగోజు కృష్ణమూర్తి, రామోజు నాగ, కత్రోజు లింగాచారి, కేసోజు వెంకట్, అడ్లూరి మల్లికార్జున్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లను పునరుద్ధరించాలి



హుస్సేన్ నాయక్‌తో మాట్లాడుతున్న రామకృష్ణ

హన్మకొండ: ఎస్సీ, ఎస్టీ కులాలపై రీసెర్చ్ చేసే విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు నిలిపివేసిందని, ఆ స్కాలర్‌షిప్‌లను వెంటనే పునరుద్ధరించాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ హనుమకొండ జిల్లా చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ కోరారు. ఈమేరకు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. హనుమకొండలోని రహదారులు, భవనాల శాఖ అతిథి గృహంలో హుస్సేన్ నాయక్‌ను శనివారం కలిశారు. ఎస్సీ, ఎస్టీ కులాలపై పరిశోధనలు జరిగితే ఆ కులాల అభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకునేందుకు అవకాశముంటుందని రామకృష్ణ అన్నారు. పీహెచ్‌డీ స్కాలర్‌షిప్‌లను కేంద్ర ప్రభుత్వం ఎనిమిది సంవత్సరాల క్రితం నిలిపి వేసిందని వాపోయారు.

గిరిజన భవన్‌కు అన్ని హంగులు సమకూర్చాలి

హనుమకొండ అశోకా కాలనీలోని గిరిజ భవన్‌కు అన్ని హంగులు సమకూర్చాలని గిరిజన ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈమేరకు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ దృష్టికి గిరిజన సంఘాలు తీసుకెళ్లాయి. దాంతో ఆయన స్వయంగా వచ్చి గిరిజన భవన్‌ను పరిశీలించారు. గిరిజన భవన్‌లో రీసౌండ్ వస్తోందని, ఇంటీరియర్ లేకపోవడంతో అసౌకర్యంగా ఉందని, ఎండాకాలంలో తీవ్రమైన వేడి ఉంటోందని, దాంతో కార్యక్రమాలు నిర్వహించుకోకపోతున్నట్లు సంఘాల నాయకులు వివరించారు. అనంతరం హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ సమస్యలను కలెక్టర్, అధికారులు దృష్టికి తీసుకెళ్లి పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించి వినియోగానికి అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయండి



తనిఖీ చేస్తున్న కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: యుద్ధప్రాతిపదికన చెత్త సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ పనుల్ని పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారుల్ని ఆదేశించారు. శనివారం వరంగల్ పరిధి పోతన నగర్, హనుమకొండ పరిధి బాల సముద్రంలో నిర్మాణంలో ఉన్న సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల పనుల పురోగతిని కమిషనర్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సివిల్ పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చేలా చూడాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఈతనిఖీల్లో సీఎంహెచ్‌ఓ రాజేశ్, ఈఈలు రాజయ్య, సంజయ్‌కుమార్, డీఈ రవికుమార్, ఏఈ సంతోశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌రాజ్ తదితరులు ఉన్నారు.

విద్య, వైద్యం కోసం పోరాడుదాం



కేయూ క్యాంపస్: సమాన విద్య, వైద్యం కోసం పోరాడుదామని డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్ పిలుపునిచ్చారు. కేయూలోని దూరవిద్యా కేంద్రంలోని జాఫర్ సెమినార్ హాల్‌లో అసోసియేషన్ నూతన సంఘాన్ని శనివారం ఎన్నుకున్నారు. డీఎస్‌ఏ రాష్ట్ర కన్వీనర్‌గా శ్రావణ్, కోకన్వీనర్లుగా జిగర అనిల్, మున్నా గణేష్, ఉప్పుల శివ, గుండాల రమేష్ ఎన్నికయ్యారు. అనంతరం శ్రావణ్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై పోరాలని సూచించారు. జనాభా దామాషా ప్రకారం రాజకీయ, ఆర్థిక, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ల అమలుకు అసోసియేషన్ పోరాడుతోందని వివరించారు. సమావేశంలో డీఎస్‌ఏ నాయకులు పవన్, శివ, నాగరాజు, అనిల్, శరత్, రవికుమార్, అభిషేక్ పాల్గొన్నారు.

గురుకులాల్లో నాణ్యమైన విద్య అందించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎంఎస్‌ఎఫ్ బాధ్యులు



వినతిపత్రం అందజేస్తున్న బీఎస్‌ఎఫ్ బాధ్యులు

విద్యారణ్యపురి: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు రుచికరమైన భోజనం అందించాలని ఎంఎస్‌ఎఫ్ బాధ్యులు కోరారు. ఈమేరకు హనుమకొండలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల ఆర్‌సీఓ విద్యారాణిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. నాణ్యతగల సరుకులను అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ కేయూ అధ్యక్షుడు కుమ్మరి శ్రీనాథ్, నాయకులు ఓదెల అరిస్టాటిల్, వివేక్, మంద అజయ్, వరప్రసాద్, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

ఆ కళాశాలపై చర్య తీసుకోవాలి

హనుమకొండ చింతగట్టు ప్రాంతంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాల ఒక బ్రాంచ్‌కు అనుమతి పొంది అదనంగా మరో రెండు బ్రాంచీలు నడుపుతోందని బీఎస్‌ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్, నాయకులు జీవన్, మహేందర్ ఆరోపించారు. ఈమేరకు ఆ కళాశాలపై చర్య తీసుకోవాలని హనుమకొండ డీఐఈఓ గోపాల్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులకు చేయూత అభినందనీయం



నోట్‌బుక్స్ అందజేస్తున్న క్లబ్ సభ్యులు

మడికొండ: వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో మడికొండలోని మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు శనివారం నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మల్లారెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులకు దాతలు చేయూతనందించడం అభినందనీయమని కొనియాడారు. ఈమేరకు వాసవి, వనితా క్లబ్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వాసవి క్లబ్ అధ్యక్షుడు సంతోష్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన బోధన ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రధాన కార్యదర్శి నవీన్, కోశాధికారి కిరణ్, వనిత క్లబ్ అధ్యక్షురాలు లావణ్య, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

‘క్లీన్ అండ్ గ్రీన్’



పరిసరాలను శుభ్రం చేస్తున్న ఉద్యోగులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు, నాన్‌టీచింగ్ సిబ్బంది కలిసి శనివారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా చెత్తాదారాన్ని తొలగించి పరిసరాలను శుభ్రంచేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విశాల మహేందర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ నేతాజీ, సూపరింటెండెంట్ ప్రభాకర్, లైబ్రేరియన్ డాక్టర్ సుజాత, డాక్టర్ సంగాల ఎఫ్రిమ్ రాజు, సదాశివుడు, మహ్మద్ హుస్సేన్, నర్మద, రాహుల్, ఆనంద్, పున్నంచందర్ పాల్గొన్నారు.



కాజీపేట: మొక్క నాటుతున్న వాకర్స్

మొక్కలు నాటిన వాకర్స్

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ వడ్డెపల్లి ట్యాంక్ బండ్‌పై వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం మొక్కలు నాటారు. సంఘం బాధ్యుడు కైలాస్ అగర్వాల్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని సుబ్రహ్మణ్య స్వామి దేవాలయ పరిసర ప్రాంతాల్లో పూలు, పండ్ల మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.రవిందర రెడ్డి, బొల్లెపల్లి రాజేశ్వర్, మెజిషియన్ శ్రీనివాస్ రెడ్డి, మహమూద్ అలీ, కొంండ్ర శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీకి కేంద్రం బాధ్యత వహించాలి

ఖిలా వరంగల్: నీట్ పేపర్ లీకేజీలకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, జ్యుడీషియల్ విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య డిమాండ్ చేశారు. వరంగల్ ఉర్సు గుట్ట సీపీఎం కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో బాబు, అరూరి కుమార్, బషీర్, దాసు, దుర్గయ్య, యారా ప్రశాంత్, సాంబమూర్తి, ఆవుల ఉదయ్, భవాని పాల్గొన్నారు.

కాశిబుగ్గ: నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్ నవీద్ డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్‌బీ నాయకులు రోహిత్, అఖిల్, సుమన్, రాజు, సాయి, హరీష్ పాల్గొన్నారు.

అవకతవకలపై విచారణ జరిపించాలి

విద్యారణ్యపురి: నీట్ ప్రశ్నపత్రాల లీకేజీపై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరిపించాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని బాలసముద్రంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ బాధ్యులు చరణ్, అర్జున్, రామ్, నందిని, కల్యాణ్, సందీప్, చార్, రాజ్‌కుమార్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

నీట్ పేపర్ లీకేజీ ఘటనకు ప్రధాని మోదీ ప్రభుత్వం బాధ్యత వహించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారావు డిమాండ్ చేశారు. హనుమకొండలోని అశోకా సెంటర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద శనివారం నిరసిస్తూ తెలిపారు. నిరసన కార్యక్రమంలో నాయకులు దీపక్, మహేంద్ర, గోవిందు, రాజు, సాయిచరణ్, నాని, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల ఎదుట..

కేయూ క్యాంపస్: నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని తెలంగాణ స్టూడెంట్స్ ఫెడరేషన్ (టీఎస్‌ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎదుట శనివారం నిరసన తెలిపారు.

హరీశ్‌రావు.. రాజీనామాకు సిద్ధంగా ఉండు



హసన్‌పర్తి: మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి



మడికొండ చౌరస్తాలో క్షీరాభిషేకం



కాజీపేట అర్బన్: కడిపికొండలో..

హసన్‌పర్తి: ఆగస్టు 15వ తేదీలోపు రైతులకు రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఈక్రమంలో రాజీనామాకు మాజీ మంత్రి హరీశ్‌రావు సిద్ధంగా ఉండాలని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్‌రెడ్డి అన్నారు. రెండు లక్షల రుణమాఫీని ఏకకాలంలో అమలు చేయడానికి మంత్రివర్గం ఏకగ్రీవంగా తీసుకున్న నిర్ణయాన్ని రైతులు, కాంగ్రెస్ నాయకులు హర్షించారు. ఈమేరకు కిసాన్ కాంగ్రెస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కిట్స్ క్రాస్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాటను కాంగ్రెస్ పార్టీ తప్పదన్నారు. ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే ఐదు గ్యారంటీలు అమలవుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతపాక సునీత, మాజీ సర్పంచ్‌లు పెసరు శ్రీనివాస్‌రెడ్డి, మదన్‌గౌడ్, సమ్మిరెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు పొన్నాల రఘు, కనపర్తి కిరణ్, ఆరెల్లి వెంకటస్వామి, టీఆర్‌ఎకే రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు మేర్గ రాజేష్, అనిల్‌రెడ్డి, దేవస్థాన మాజీ చైర్మన్ జె.రవి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చరణ్, తాళ్లపల్లి రమేష్, రామంచ ఐలయ్య, డాక్టర్ రవియాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



హసన్‌పర్తి: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

రైతు రుణమాఫీకి కేబినెట్ తీర్మానించడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు భీమారం సెంటర్‌లో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శనివారం రాత్రి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రజిత, మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు సంగాల ప్రేమ్‌కుమార్, గ్రామశాఖ అధ్యక్షుడు రాజు, నాయకులు బూర సారంగపాణి, శ్రీకాంత్, గాజాల గోవర్దన్, వీసన్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ ప్రకటనపై హర్షం

మడికొండ: ఏకకాలంలో రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ చేస్తామని మంత్రివర్గం ఆమోదించడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మడికొండ చౌరస్తాలో పాలాభిషేకం నిర్వహించారు. రైతుల సంక్షేమానికి పాటుపడే రైతు ప్రభుత్వం కాంగ్రెస్ సర్కారు అని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గుర్రం జ్యోతి అమర్‌నాథ్, ఎడబోయిన ప్రభాకర్, కుర్ల మోహన్, బైరి కొంరయ్య, లింగమూర్తి, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, వస్కుల శంకర్, నాగరాజు, సట్ల సదానందం, హరీష్, వస్కుల భాస్కర్, మూల మురళి, కళ్లెపు నరేష్, కడమంచి సాయిలు, మహేదర్, జక్కుల సదానందం, రమేష్ పాల్గొన్నారు.

కడిపికొండలో..

కాజీపేట అర్బన్: రైతు రుణమాఫీ ప్రకటనతో కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు కడిపికొండ గ్రామంలో పీఏసీఎస్ దర్గా కాజీపేట మాజీ వైస్ చైర్మన్ గంగుల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బస్కే శ్రీలేఖకృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు నర్మెట వెంకటరమణ గౌడ్, సట్ల సదానందం, కట్కూరి రమేష్, రాము, నర్మెట వేణు, ప్రణయ్, సుధాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



కాజీపేట అర్బన్ : కాజీపేట మండలం కుమ్మరిగూడెంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు బీజేపీ నాయకుడు మాదాసు వెంకన్న నోట్‌బుక్స్ అందజేసి ఔదార్యం చాటుకున్నారు. శుక్రవారం సాక్షిలో ‘బడి బాగుపడాలనే’ శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు నోట్‌బుక్స్‌తోపాటు క్వింటాల్ బియ్యాన్ని అందజేసి, బడికి పూర్వవైభవానికి పాటుపడుతున్న నల్లమారి రమేష్‌ను వెంకన్న అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.